అ ప స్వ రా లు

[యువ మాసపత్రిక]

ఏ స్త్రీ అయినా జీవితంలో ఒక్క పురుషుణ్ణే
ప్రేమించగలదేమో!
ప్రేమించిన వాడిని పొందలేక —
పెళ్ళిచేసుకున్న వాడిని ప్రేమించలేక –
నలిగిపోయే స్త్రీ బ్రతుకులో మిగిలేవి
అపస్వరాలేనా? ?....

అపస్వరాలు

"రేపు సాయంత్రం 312 నెం. రూమ్‌లోని పేషంటును డిశ్చార్జి చేశేస్తాం! ఎల్లుండి ఉదయం వస్తే మీకు ఆ రూము ఇస్తాను" అంది డాక్టరు కళ్ళద్దాలు తీసి రుమాలుతో తుడుచుకుంటూ.

"థేంక్యూ డాక్టర్! ఎల్లుండి ఉదయం వస్తాను. ఈ ఎడ్వాన్సు ఉంచండి!" అంటూ యాభై రూపాయలు తీసి టేబిలుమీద వుంచాను.

డాక్టర్ టేబిలు మీదున్న బుక్ తీసి నా పేరు, చిరునామా నోట్ చేసుకుని ఇక వెళ్ళవచ్చునన్నట్లు చూసింది.

ఆవిడకు నమస్కరించి బయటకు వచ్చాను. ఎర్రటి ఎండలో అమెరికన్ హాస్పిటల్ గోడలు తళతళ లాడుతున్నాయి. మధ్య ఆవరణలో వుంచిన మేరీమాత తెల్లని పాలరాతి విగ్రహం ఎండలో మెరుస్తోంది. విగ్రహం వెనుకనున్న అరటి ఆకులు ఆర్చిలా వంగి విలాసంగా కదులుతున్నాయి.

మెట్లు దిగి కారిడార్‌లోకి వచ్చి టాక్సీలో కూర్చున్నాను. "అలంకార్ లాడ్జికి పోనియ్!" అన్నాను.

డ్రైవరు మౌనంగా స్టార్ట్ చేసాడు. టాక్సీ మెల్లిగా కదిలి కృష్ణనగర్ రోడ్డువైపు వెళ్తోంది!

ఆరునెలల క్రితం నుండి— నాకు ఊపిరితిత్తుల్లో అప్పుడప్పుడు నొప్పి వస్తోంది. మొదట్లో వారానికో మాటు వచ్చేది. తరువాత రోజులో ఏదో టైములో ఒక్కసారైనా రావటం మామూలయి పోయింది. నొప్పి ముదిరేలోగా నాన్నగారు గృహవైద్యం చేసేరు. కషాయాలు, కాపడాలు పెట్టారు. ఏ మాత్రం గుణం కన్పించలేదు. నాకు నొప్పి వచ్చినప్పుడల్లా అమ్మ బెంగ బెట్టుకొని తల్లడిల్లిపోయేది. పుట్టిన నలుగురిలోనూ మిగిలింది నేనొక్కణ్ణే! మిగిలిన వాళ్ళందరూ యేదో బాలారిష్టాలతోనే పోయేరట!

ఇక నాన్న సంగతి చెప్పనక్కరలేదు!

మాటిమాటికీ నొప్పి వస్తూంటే ఒక్కోసారి చచ్చిపోతే బాగుండు అనిపించేది.

ఈ ఆరునెలల్లోనూ మూడునెలల పైగానే ఆఫీసుకి శలవు పెట్టేను. ఎంత మేనేజరునయినా పదే పదే శలవు పెట్టడం ఏం బాగుంటుంది? ఈ అనారోగ్యం వలన క్రింది ఉద్యోగస్థుల దృష్టిలోకూడా కొంత చులకన అయిపోయాను. ఆఫీసు మేనేజరు అంటే బాధ్యతతో కూడిన ఉద్యోగం. బాధ్యతని సక్రమంగా నిర్వర్తించకపోతే పదవిలో వుండి ప్రయోజనము లేదన్నది నా పాలసీ.

నొప్పి వచ్చినపుడు ఏదో మందు వెయ్యటం, తాత్కాలికంగా తగ్గి మళ్ళీ రావటం - 'ఇలా వూరుకుంటే లాభంలేదు. ఒకసారి విశాఖపట్నం వెళ్ళి మాధవరావుగార్కి చూపించుకుని రాకూడదూ!' అన్నారు నాన్న.

ఆయన పోరు పడలేక విశాఖపట్నం వచ్చేను. నాన్నకూడా నాతో బయల్దేరబోయేరు గాని నేనే వద్దన్నాను. ఆయనది పెద్ద వయస్సు. అదీ గాక 'డయాబిటీసు, బ్లైడ్ ప్రెషరు' ఆయాసం వస్తే మనిషి కారు! అమ్మ ఎట్లాగూ ఆయన్ని కనిపెట్టుకుని వుండకపోతే జరగదు!

అమ్మ నేను బయలుదేరి వస్తుంటే కళ్ళనీళ్ళు పెట్టుకుంది. ఇరవై నాలుగేళ్లు వచ్చినా అమ్మ కంటికి నేను ఇంకా పసిపాపలాగే కనిపిస్తాను కాబోలు!

ఏమిటో ఈ జీవితాలు!

లేనివాడికి లేని బాధ, ఉన్నవాడికి మరో బాధ! లంకంత ఇల్లు, బోలెడంత ఆస్తి, ఆర్థికంగా ఏ ఇబ్బందులూ లేవు, లేనివల్లా ఒక్కటే! ఆరోగ్యం!

డాక్టర్ మాధవరావుగారు నాన్నగారికి స్నేహితులు. విశాఖ పట్నంలో ప్రాక్టీసు చేస్తూ బాగా పేరూ, డబ్బూ గడించేరు! ఆయన్ని

కలిస్తే నన్ను పరీక్షచేసి అమెరికన్ హాస్పిటల్లో జాయిన్ అయిపొమ్మ న్నారు! రోజూ తనే అక్కడికి వచ్చి చూస్తానన్నారు. ఈ జబ్బుకి విశ్రాంతి చాలా అవసరమని చెప్పేరు!

ఇరవై దినాలకు సరిపడిన బట్టలు పంపించమని, నా ఆరోగ్యము గురించి బెంగపెట్టుకోవద్దనీ నాన్నగారికి ఉత్తరం వ్రాసి పడేశాను. బ్రేక్ పడిన కుదుపుతో ఆలోచనలనుండి విడివడ్డాను. లాడ్జి అలంకార్ ముందు టాక్సీ ఆగి వుంది. టాక్సీకి బిల్లు చెల్లించి అలంకార్‌లో ఒక రూమ్ తీసు కున్నాను, ఈ రెండు దినాలు గడపటానికి!

* * *

“ఇదిగో, ఇదే మీ గది! మీకు ఏం కావాలన్నా నన్ను పిలవండి! ఈ వరండా చివర గదిలో నేను వుంటాను!” అంది నర్స్.

“థేంక్స్!” అంటూ గదిలోకి వెళ్లాను.

డబ్బుకి సంబంధించిన హాస్పిటల్ కనుక గదికి అన్ని సౌకర్యాలు ఉన్నాయి! మధ్యలో స్ప్రింగ్‌కాట్, ఫోమ్ పరుపు, పైన సీలింగ్ ఫేను, బట్టలస్టాండ్ అన్ని హంగులతో గది బాగానే వుంది. గదిని ఆనుకుని మరో చిన్న గది, దాని ప్రక్కనే ఎటాచ్‌డ్ లావెట్రీ, బాత్‌రూమ్! గదికి అవతలివైపు తలుపు తెరిస్తే చిన్న బాల్కనీ! బాల్కనీలో నిలబడితే ఉర కలు వేస్తున్న సముద్రం ఎదురుగా కనిపిస్తుంది. దిక్చక్రం దగ్గర నలు సుల్లా రెండు ఓడలు! కుడిప్రక్కగా లైట్‌హౌస్ కొండ! సముద్రపు ఒడ్డున ఎత్తుతో యూనివర్శిటీ లేడీస్ హాస్టలు! ఇంకేవో రెండు పచ్చని భవంతులు! అక్కడ నిలబడి చూస్తుంటే ఆ దృశ్యం ఎంతో మనోహ రంగా అనిపించింది. చల్లని ఆ వాతావరణానికి సగం రోగం తగ్గినట్లని పించింది!

బ్యాగులోని ఫ్లాస్కు, రెండు జతల బట్టలు తీసి అలమారులో

సర్దాను! మాగజైన్లు తీసి టేబిలుమీద పడేశాను! తలుపు దగ్గరగా వేసి, మంచంమీద వాలి సిగరెట్టు తీసి ముట్టించాను!

తలుపు తెరుచుకుని నీళ్ళ కూజాతో వచ్చిన నర్సు నా వంక ఆశ్చర్యంగా చూస్తూ తలుపు దగ్గరే ఆగిపోయింది!

"ఈ హాస్పిటల్లో ఎవరూ సిగరెట్టు కాల్చకూడదు. ఈ సంగతి మీకు తెలీదా? ముందు ఆ సిగరెట్టు అవతల పారెయ్యండి, డాక్టర్ చూస్తే నా ఉద్యోగం ఊడుతుంది" అంది మందలింపుగా.

"సారీ" అంటూ సిగరెట్టు నలిపి అవతల పడేశాను.

నీళ్ళ కూజా గదిలో పెట్టి "రెస్ట్ తీసుకోండి" అంటూ నర్స్ వెళ్ళి పోయింది.

హతోస్మి! అసలే కాలం గడవక పిచ్చెత్తినట్లుంది. సిగరెట్లు కూడా లేకపోతే నేను బ్రతకలేను!

టేబిలుమీది మాగజైను చేతిలోకి తీసుకున్నాను.

మధ్యాహ్నం వరకు అది చూస్తూ గడిపాను. మధ్యాహ్నం నర్స్ భోజనం తీసుకువచ్చింది. ఈలోగా రెండు మూడుసార్లువచ్చి కుశలప్రశ్నలు వేసి ధైర్యం చెప్పి వెళ్ళింది.

అసలు చిన్నతనంనుండీ నాకు హాస్పిటల్ అంటే ఒక విధమైన భయం వుంది! మృత్యువుకి చేరువవుతున్నవాళ్ళే హాస్పిటల్లో చేరుతారని ఒక అపప్రథ నా మనసులో తిరుగాడుతూ ఉండేది. ఆ భయాలూ, నమ్మకాలూ చిన్నతనం నుండీ నాలో కదల్లాడుతూ ఉండడం వలన జబ్బు ప్రవేశించగానే నేను భయంతో పిడచకట్టుకు పోయేను. హాస్పిటల్కి సాధ్యమయినంత దూరంగా ఉండి నా జబ్బు నయం చేసుకుందామనుకున్నాను. కాని— నా కోరిక నెరవేరలేదు! నేనిక్కడ—ఇన్‌పేషంటుగా చేరక తప్పలేదు -

కాని ఇక్కడ వాతావరణం, ట్రీట్‌మెంటు, నర్సింగూ, నాలోని భయాన్నీ' సంకోచాలనూ కొంతవరకు పారద్రోలాయి.

భోజనం ముగించి మంచంమీద కూర్చున్నాను.

తలుపు టకటకమని మెల్లిగా ఎవరో తట్టారు. నేను లేచి తలుపు తీసేందుకు వెళ్ళేలోపున తలుపు సందు నుండి రెండు కవర్లు లోపల పడ్డాయి. ఆత్రంగా అవి తీశాను. రెండింటిమీద చిరునామా నాది కాదు! వి. భారతీదేవి అని వుంది. కొంచెం ఇంచుమించుగా రెండింటిమీద చిరునామాలు ఒకేలా వున్నాయి. రెండు కవర్లమీద ఫ్రమ్ ఎడ్రసులు లేవు. కాని స్పష్టంగా అవి రెండూ, 312 రూమ్‌కు వచ్చినవే !

బహుశా ఈ భారతీదేవి ఇంతకు ముందు ఈ రూమ్‌లో ఉండే ఆవిడ కాబోలు!

నా ఆలోచనలకు స్వస్తిచెప్పి తలుపు తీసాను! పోస్ట్‌మెన్ అప్పుడే మెడ దిగిపోయినట్టున్నాడు. వరండామీద ఎవ్వరూ కనిపించలేదు. తిరిగి రూమ్‌లోకి వచ్చి తలుపు గడియపెట్టి మంచంమీద కూలబడ్డాను.

చేతిలో రెండు ఉత్తరాలూ కదుల్లాడు తున్నాయి. వాటిలో ఏముందో?

పనిలేకుండా కూర్చున్న నాకు కోతికి కొబ్బరికాయ దొరికినట్లు ఈ ఉత్తరాలు దొరికేయి.

మనిషి మనసు కోతిబుద్ధికి ఏ మాత్రం తీసిపోదనుకుంటా. పరాయి వాళ్ళ ఉత్తరాలు చదవటం తప్పని తెలియనంత అసభ్యత, కుసంస్కారం నాలో లేవు. కాని ఈ సమయంలో ఉత్తరాల విషయం తెలుసుకోవాలన్న కౌతుకం, ఉత్సుకత నన్ను అవి తెరిచేదాకా నిలవనియ్యలేదు.

ఒక కవరు విప్పాను. ముత్యాల కోవలాటి దస్తూరి! తెల్లని బాండ్ పేపరుమీద నల్లని అక్షరాలు మిలమిల్లాడుతున్నాయి. "భారతీ ! ఈ సంబోధన చూచి, "ఇంత చనువుగా రాసేది ఎవరా ? అని

ఆశ్చర్యపోతున్నావు కదూ ? నేను, భారతీ : కృష్ణని ? నీ కృష్ణని ! నీ హృదయకవాటాల్ని తెరిచి, ఒక్కమారు జ్ఞాపకాల నీడల్ని తడుముకో. మన వూరు—బాల్యంలో మనం కలిసి తిరిగిన ప్రదేశాలు—చెరువు ఒడ్డున ఆడిన ఆటలు—ఈశ్వరుని గుడి మంటపంలో కబుర్లు—ఆకాశంలో అందాల చందమామ గోరుముద్దలు ... నువ్వు వెల్లడిచేసే ధర్మ సందేహాలు—నా పరిజ్ఞానాన్ని వుపయోగించి చెప్పే జవాబులు—తిరునాళ్ళలో వేడుకలు—బాల్యం ! అదో తియ్యని అనుభవం ! ఆ తరువాత ....వయస్సు మనిద్దరిపైన వేసిన కొత్త ముసుగులు. వలపుల వలలు ! వాటిని తొలగించీ, తొలగించలేని అశక్తతలు—కొన్ని బంధాలు—విడదీయలేని అనుబంధాలు ! .... నీకు గుర్తున్నదా? ఆ రోజు....మబ్బుపట్టి ఆకాశం మసకబారినవేళ....మీ చిన్న తమ్ముడిని తీసుకుని, పువ్వులు పట్టుకుని నువ్వు గుడికి వస్తున్నట్లు తెలిసి, నేను అక్కడ నీ కోసం వేచి వున్నాను. ఆవేళ—ఆకాశనీలం పట్టుచీరెలో, ప్రకృతి అందాలన్నీ కలబోసుకుని ఈ రూపు ధరించివచ్చిందా? అన్నట్టున్న నిన్ను చూచి—ఈ అసమాన సౌందర్యం ఎవరి స్వంతమౌతుందో?" అని భయపడుతున్నానని నేను అన్నాను. నువ్వు—"భయం దేనికి? ఈ సౌందర్యం నా స్వామి సొత్తే" అన్నావు. "ఎవరా స్వామి?" అని నేను అడిగితే, 'నేను చెప్పను బాబూ' అని సిగ్గుల దొంతరలో ముడుచుకుపోతూ పలికావు.

"భారతీ ! నీమాట—నీ వాగ్దానం ఏమయింది? నేను పై చదువుల నిమిత్తం అమెరికా వెళ్ళి వచ్చేసరికి, నీకు వివాహం అయిపోయిందని తెలిసింది. అమెరికా వెళ్ళేముందు కూడ—నన్ను తప్ప మరొక పురుషుణ్ణి నీ జీవితంలోకి ఆహ్వానించనని చేసిన ప్రమాణం ఏమైంది?— ఈ వార్త తెలిసి హతాశుణ్ణి అయ్యేను.

ఆలోచనల్తో మెదడు బ్రద్దలవుతూంటే, తిండికీ, నిద్రకూ దూరమై పరితాపంతో ఒకవంక, నీమీద ఆగ్రహంతో ఒకవంక దహించుకుపోతూ

రెండు దినాలు గడిపాను....భారతీ! కాని, ఇప్పుడు....ఇప్పుడు నాకు నీమీద ఆగ్రహం లేదు. భారతీ! కేవలం చూడాలన్న ఆకాంక్ష తప్ప - ఒక్కమారు నీ విగ్రహాన్ని దర్శించుకుని వెళ్లిపోతాను. ఆఖరు సారిగా చూపిన నీ ఆకారాన్ని నా హృదయంలో ప్రతిష్ఠించుకుని, శేషజీవితాన్ని తృప్తితో నింపుకోటానికి ప్రయత్నిస్తాను. ఈ మధ్య నీ శరీరంలో అస్వస్థత ఏర్పడిందని, విశాఖపట్నంలో హాస్పిటల్లో వున్నావని వివరాలు తెలుసుకున్నాను. అడ్రసు కనుక్కొని వుత్తరం రాస్తున్నాను. నీ భర్త హాస్పిటల్లో నీవద్ద లేడని తెలిసి, ధైర్యంగా ఈ లేఖ వ్రాస్తున్నాను.

—నీ (వాడు కాలేని) కృష్ణ.

ఉత్తరం మడిచాను.

నా మనసంతా విచారం పేరుకు పోయింది. సహజంగా నా గుండె ప్రతి చిన్న విషయానికి స్పందిస్తుంది. ఏ వుద్రేకం వుద్భవించినా, నేను విపరీతంగా తల్లడిల్లిపోతాను. ఒక కథ చదివితేనే చాలాసేపు ఆ కథ గురించి ఆలోచిస్తూ వుండిపోతాను. అట్లాంటిది....ఇది—ఈ వుత్తరం నాతో సంరంభాన్ని లేపింది. "భారతిలాంటి ఆడవాళ్ళు వుంటారా?" అని చకితుణ్ణి అయ్యాను. "భారతీదేవి కృష్ణపట్ల ఎంత నిర్దయగా ప్రవర్తించింది!" అని బాధపడ్డాను. కృష్ణకి జరిగిన అన్యాయానికి విచారించాను. కృష్ణని తల్చుకుంటే జాలి, సానుభూతి వెల్లువయి వుబుకుతున్నాయి. భారతీదేవి ఎదురుగావుంటే—"నిన్ను ప్రాణప్రదంగా ప్రేమించే కృష్ణని ఎట్లా వదులుకున్నావు? అతడు అమెరికానించి వచ్చేవరకు ఆగలేకపోయావా?" అని నిలదీసి అడుగుదామనిపించింది. ఏదీ భారతీదేవి? నిన్ననే వెళ్ళిపోయింది! కృష్ణ రాసిన ఉత్తరంలో తేదీ చూశాను. 16వ తేదీన వస్తున్నానని రాసాడు. అంటే ఇవాళ వస్తాడన్న మాట! కల్సుకోలేక పోయినందుకు విచారిస్తూ వెళ్ళిపోతాడు!! ప్చ్.

రెండవ వుత్తరం తీశాను.

అది భారతీదేవి భర్త రాసినది. పూర్తిగా సంసారపక్షంగా నడిచింది వ్రాత.

"భారతికి—

నీవు కులాసాగా వున్నట్లు తలుస్తాను. నిన్ను హాస్పిటల్లో చేర్చి ఇక్కడకు వచ్చిన పర్నాడే తమ్ముడివద్దనుండి టెలిగ్రాం వచ్చింది. నాన్నకి సీరియస్‌గా వుందని. తక్షణం రమ్మనమని! వెంటనే అక్కడకు వెళ్లాను. ఇప్పుడు కొంచెం జ్వరం తగ్గింది. నేను అక్కడకు మూడు రోజుల్లో వస్తున్నాను. అప్పటికి నీ ఆరోగ్యం బాగవుతే. త్వరగా డిశ్చార్జి చేయించుకొని వెళ్ళిపోవచ్చు.

అమ్మ, తమ్ముళ్ళు, చెల్లాయిలు అంతా ఇక్కడ కులాసాగా ఉన్నారు.

అమ్మ నా వెంట వస్తానంటూంది. నీకు వంట్లో బాగులేదని, హాస్పిటల్లో వున్నావని తెలిసి ఆవిడ పడిన ఆందోళన ఇంతింతకాదు. నిన్ను తీసుకుని మన వూరు వెళ్ళేముందు మా వాళ్ళింటికి వెళ్ళి అక్కడ రెండు రోజులు అయినా వుంచకపోతే వాళ్లు వూరుకునేట్టు లేరు. ఆ ప్రకారం చేద్దాం!

ఇంకకంటె రాయాల్సినవేం లేవు. వుంటాను.

—శ్రీధరరావు.

నివ్వెరపోయాను. భారతీదేవి భర్త ఈ ఉత్తరంలో మూడు రోజుల్లో ఇక్కడికి వస్తున్నట్టు రాసేడు. వుత్తరంలో నాలుగు రోజుల క్రిందటి తేదీ వేసి వుంది. అంటే నిన్ననే శ్రీధర్ రావు వచ్చి భార్యని తీసుకువెళ్ళిపోయాడన్నమాట! ఈ ఉత్తరం ఈ రోజున ఇక్కడికి చేరింది! మైగాడ్! పోస్టల్ డిపార్టుమెంటిని తల్చుకుంటే కోపం, నవ్వూ రెండూ... వచ్చాయి!

కృష్ణ ఎంత ఆత్రంగా వస్తాడో! భారతీదేవి డిశ్చార్జి అయి భర్తతో

కలిసి వెళ్ళిపోయిందని తెల్సి చాలా విచారిస్తాడు. కృష్ణని తల్చుకుని మరో మారు నిట్టూర్చాను. భారతీదేవి వెళ్ళిపోయిన తర్వాత కృష్ణ రాసిన ఉత్తరం రావటంవలన అతను వస్తున్నట్లు ఆమెకు తెలియదు. ఈ వుత్తరం ముందుగా రాకపోవటాన కృష్ణ భారతీదేవి దర్శనం చేసుకునే అవకాశం తప్పిపోయింది! అతడు దురదృష్టవంతుడు.

కృష్ణవస్తున్నట్టు తెలిస్తేమట్టుకు భారతీదేవి అతను వచ్చేవరకు నిరీక్షిస్తుందా? ఉహూ, నాకు నమ్మకం లేదు. ఆడది పెళ్ళయ్యే వరకు ఒక రకపు మనస్తత్వంతో వుంటుంది. పెళ్లి అయ్యాక మరొక రకంగా మారిపోతుంది. కన్యగా వుండే వరకు ఏ పురుషుణ్ణయినా, ఎంత ఘాటుగా నయినా ప్రేమించవచ్చు. వివాహం అయిన మరుక్షణం తన మనసు, తనువు, కలలు, కోరికలు సర్వం భర్త సన్నిధిని అర్పిస్తుంది. భర్త సమక్షంలో దేవుడు కూడా పరిత్యజింపదగిన వాడిగానే తోస్తాడు.

నాకు మళ్ళీ ఊపిరితిత్తుల్లో కొంచెం నొప్పి ప్రారంభమయింది. ఒక చేత్తో కడుపు పట్టుకుని, మరో చేత్తో ఆ కవర్లు పట్టుకుని కూచుండి పోయాను. నిజానికి నాకూ, ఈ భాగోతానికీ ఏమీ సంబంధం లేదు! కాని, ఎంత చిన్న విషయమైనా ఉద్రేకం కలిగిస్తే అంత త్వరగా దాన్ని విడిచి పెట్టి మరిచిపోలేను! ఈ వుత్తరాల కథమీద నా వుత్సుకత ఇంకా తగ్గ లేదు. ఈ భారతీదేవిమీద నా కోపం ఇంకా తరగలేదు.

నర్సుని పిల్చి ఆ వుత్తరాలు ఇచ్చెయ్యాలనుకున్నాను. నా కెందుకు అవి? వాటితో సంబంధం వున్న ఇద్దరు వ్యక్తులు లేనే లేరు. మూడో వ్యక్తి రాబోతున్నా—అతనికి వుత్తరం చూపించి అతనిలో విషాదాన్ని నా కళ్ళతో నేనింకా చూడలేను.

నర్సుని పిల్చి, ఉత్తరాల సంగతిచెప్పి "భారతీదేవి అనే ఆమె ఈ గదిలో వుండేవారా?" అని యథాలాపంగా ప్రశ్నించాను.

నర్సు ముఖంలో మార్పు వచ్చింది. నిట్టూర్చింది.

నేను మామూలుగా నవ్వుతూ "చూడండి...." అని యేదో చెబు తున్నాను.

నర్స్ గబగబా "మీకు తెలియదా ఈ విషయం? భారతీదేవి పోయారు" అంది.

నాకేం బోధపడలేదు. నోరు తెరిచి చూశాను.

"నిన్న ఈ రూమ్‌లోనే చనిపోయారు ఆవిడ .... ఓహో ! మీరు ఇవాళ కదూ వచ్చారు. మీకు తెలీదు! ఔను!" అంది నర్స్.

"చాలా మంచావిడండీ, పాపం .... ఈ మంచంమీదనే కూచుని నాతో ఎన్నికబుర్లు చెప్పేవారో! చాలా సరదాగా మాట్లాడేవారు. కాని అంత రంగంలో ఏదో దిగులుతో వున్నట్లు మాత్రం ఆవిడ తీరుచూస్తే నాకు అని పించేది. అరె, అదేం! మీరలా అయిపోయారేవిటి ? నొప్పి వస్తోందా? అన్నట్టు—ఇంజక్షన్ ఇవ్వాలి కదూ? సిరెంజి తెస్తాను. పడుకోండి. తిరగ కండి. బలహీనంగా వున్నారు...." అంటూ వెళ్ళిపోయింది.

భారతీదేవి చనిపోయింది!....చని....పోయింది....

నా చెవుల్లో నర్స్‌మాట సముద్రం హోరులా ధ్వనిస్తూంది !

భారతీదేవి మరణించిందన్న నగ్నసత్యం నన్ను నిలువునా కంపింప జేస్తూంది. సృష్టిలో ఈ జీవితాలు ఎంత చిత్రమైనవి!

"ఎన్ని కబుర్లు చెప్పేవారండీ, ఆవిడ, ఈ గదిలో ఈ మంచం మీదే...." తృళ్ళిపడ్డాను. గదిలో మంచంవేపు చూసాను. తెల్లటి నాజూ కైన, ఆకర్షణీయమైన విగ్రహం పడుకుని వున్నట్టు—కన్పించింది.

ఒళ్ళు జలదరించింది.

కళ్ళు నులుముకుని చూసాను. మంచం మామూలుగానే వుంది. తల తిప్పాను.... ఎవరు? ఎవరక్కడ? తెల్లని వాయిలు చీరె....పిరుదులు దాటిన వాల్జడ.... కిటికీ దగ్గర.... వూచలు పట్టుకుని, అవతలికి చూస్తోంది.

చెమట పటి చొక్కా తడిసింది.

ఈ క్షణంలో— నాకు భారతీదేవి చనిపోయింది అన్న విచారం కన్నా, దిగులుకన్నా, ఆమె ప్రేతాత్మ ఈ గదిని ఆవరించుకుని వుందన్న భయమే ఎక్కువగా వుంది అదేమిటో!!? గది నలుమూలలా బితుకు బితుకుగా చూస్తూ తలుపులికి అంటుకు వుండిపోయాను.

"ఏమండీ...." సన్నని కంఠస్వరం! నాజుగ్గా! నా వెనగ్గా!!

త్రుళ్ళిపడి వెనక్కి తిరిగాను! నర్స్! ఇంజెక్షన్ చెయ్యటానికి సిరంజి పట్టుకు నించుంది! "పిలిస్తే అలా త్రుళ్ళిపడతారేమండీ? గలగల నవ్వింది. మరొకప్పుడైతే నర్స్ సౌందర్యానికి, ఆ హొయలుకి, ఆ నవ్వులోని మాధుర్యానికి కులాసా చెందేవాణ్నేమో గాని, ఇప్పుడు కేవలం భయం ఒంట్లో స్వైరవిహారం చేస్తూ మిగతావాటికి చోటివ్వటం లేదు.

ఇంజక్షన్ చేసి వెళ్ళిపోతున్న నర్స్‌ని పిలిచాను.

"సిస్టర్! చూడండి.... మరో రూం ఏదైనా ఖాళీగా ఉందేమో, చూసి చెప్పండి" అన్నాను.

ఆమె ఏదో చెప్పబోతూంటే అడ్డుపడుతూ. "నాకీ రూం సౌకర్యంగా లేదు. దయచేసి మరో రూంలోకి మారేలా ఏర్పాటు చెయ్యండి" అన్నాను.

"ఊ — అలాగే— చూస్తాము" అని నర్స్ వెళ్ళిపోయింది.

"లాభంలేదు! నర్స్ నా మాటలు సీరియస్‌గా తీసుకోవటంలేదు! డాక్టరుతో చెప్పి రూం మార్చుకోవాలి." అనుకొని తలుపు గడియపెట్టి మెట్లు దిగి తిన్నగా ఆఫీస్‌రూంకి వెళ్ళేను.

"మూడువందల పన్నెండో నెంబరు రూము, భారతీదేవి అనే ఆవిడ వుంటోంది. ఆ రూము ఎక్కడ వుందో చెప్తారా?" అని అడుగుతున్నాడు అక్కడున్న బంట్రోతుని ఎవరో?

గబగబా దగ్గరకెళ్ళాను.

అతడు తెల్లగా, పొడుగ్గా, పల్చగ వున్నాడు. కళ్ళలో విజ్ఞానం, శరీరంలో ఆరోగ్యం, వేషధారణలో ఆడంబరం ప్రస్ఫుటమవుతున్నాయి. ఖరీదయినవిగా కనిపిస్తున్న కళ్ళద్దాలు తీసి తెల్లని చేతి రుమాలుతో తుడిచి మళ్ళీ పెట్టుకున్నాడు. ఇంతలో నాకు ఇంజక్షన్ చేసిన నర్సు అక్కడికి వచ్చి, నన్ను చూసి "రెస్టు తీసుకోమ్మంటే ఇలా తిరుగుతున్నారా?" అంటూ మందలించింది.

"చూడండి నర్స్! భారతీదేవి అనే ఆమె 312 రూమ్‌లో ఉంది. ఆ రూముకి వారి చెప్తారా?" అంటూ అతను మళ్ళీ ఆ నర్సుని ప్రశ్నించాడు.

అతని ముఖం అలసటను చెబుతోంది! మాటలు ఆతృతను ప్రకటిస్తున్నాయి. నా మెదడు చకచక పని చేస్తోంది. ఇతను .... ఇతనువెవరు? ఇతడు శ్రీధరరావు మాత్రం కాడు! ఇదివరకే ఇక్కడికి వచ్చిన శ్రీధరరావు భారతీదేవి రూం గురించి కొత్తగా ఎందు కడుగుతాడు? అతనికి ఈపాటికే ఆమె మరణవార్త తెలిసి వుండాలి. మరి ఇతను ఎవరు? ఇతను కృష్ణ! అవును కృష్ణే!

నా ఒళ్ళు ఝల్లుమంది. నర్సు అంటోంది "భారతీదేవిగారు 312 రూమ్‌లో వుండేవారండీ! కాని.... ఇప్పుడు లేరు!"

"డిశ్చార్జి అయి వెళ్ళిపోయారా?" ఆత్రంగా ఆమెను అడుగుతున్నాడు.

నర్సు "ఎలా చెప్పను?" అన్నట్టు ముఖంపెట్టి "మీరు వారికి బంధువులా?" అంది.

కృష్ణ వూపిరి గట్టిగా పీల్చుకుని "చెప్పండి— వెళ్ళిపోయారా ఆవిడ?" అని అడిగేడు.

"సారీ! 'హార్ట్ ఎటాక్' వచ్చి నిన్ననే మరణించారు! ఆవిడ భర్త వచ్చి నిన్న సాయంకాలం శవాన్ని తీసుకుని వెళ్ళిపోయారు." అని మాట్లాడటం ఆపి గబగబ నడిచి మేడమీదికి వెళ్ళిపోయింది నర్స్-

షాక్ తిన్నవాడిలా గోడకు జారగిలపోయాడు ఆ వ్యక్తి!

"మీరు ప్రేమించిన భారతీదేవి, మీరు సర్వస్వంగా భావించిన భారతీదేవి , మిమ్మల్ని మోసంచేసి పరలోక లోకానికి వెళ్ళిపోయింది కృష్ణగారు! మీరు హృదయం విప్పి పరచిన మీ ముత్యాల్లాటి పంక్తులు, హృదయాన్ని కదిలించే అక్షరాలు నా జేబులోనే వున్నాయి" అని అతనితో గట్టిగా అరిచి చెప్పాలనిపించింది. దగ్గరకు తీసుకుని అనువయించాలపించింది. కాని అతను నాకు అపరిచితుడు! నే నెవర్నో అతనికి తెలీదు. నాకూ అతనికీ ఏ సంబంధమూ లేదు. మరి ఎలా చెప్పను? నీరసంగా అడుగులేస్తూ ఆఫీసు రూంలోకి వెళ్ళాను. నేను వెళ్ళేసరికి డాక్టరు లోపల ఇంకెవరితోనో మాట్లాడుతోంది.

నలిగిన బట్టలు, చామనచాయ, మనిషి బలంగా వున్నా, ముఖం వాడిపోయి వుంది.

"చూడండి! భారతీదేవి ఎకౌంటులో యింకా కొంత డబ్బు కట్టాలనుకుంటాను. ఎంతో చెప్తే 'పే' చేస్తాను" అంటున్నాడు.

అతని మాటలు బరువుగా వున్నాయి. మరోసారి షాక్ తిన్నట్టయ్యాను. డాక్టర్ నన్ను కూర్చోమన్నట్టు సంజ్ఞచేసి, పుస్తకము తీసి లెక్కలు కడుతోంది. నేను అతనివైపే దీర్ఘంగా చూశాను. అతను శ్రీధరరావయి వుండాలి. భారతీదేవి 'ఎకౌంట్' క్లియర్ చేయటానికి వచ్చాడన్నమాట! నాకు ఈ సంఘటనలన్నీ చూస్తుంటే మతిపోయేటట్లుంది. తలను రెండు చేతులతో పట్టుకుని కుర్చీలో కూలబడ్డాను. డాక్టరు భారతీదేవి 'ఎకౌంటు'లో ఎంత డబ్బు కట్టాలో చెప్పింది. అతను ఆ డబ్బు కట్టేసి బరువుగా నడుస్తూ బయటకు వెళ్ళిపోయాడు.

"డాక్టర్! నేను ఆ రూమ్‌లో వుండలేను. 'సెంటిమెంటల్'గా ఏదో భయం నన్ను వెంటాడుతోంది. దయచేసి మరో రూమ్ యివ్వగలరా?" అన్నాను.

డాక్టర్ నాకేసి అదోలా చూసి చిన్నగా నవ్వింది.

"ఆల్‌రైట్. 309 ఖాళీ అయింది. మీ సామాను అందులో పెట్టమని నర్సుకి చెప్తాను. మీరు వెళ్లండి!"

"థేంక్యూ డాక్టర్!" అంటూ బయటకు వచ్చాను.

బయట వరండాలో శ్రీధరరావు, కృష్ణ మాట్లాడుకొంటున్నారు.

"........" నన్ను అన్యాయంచేసి వెళ్ళిపోయింది కృష్ణా! అంతా బాగయిపోయిందని డాక్టర్లు అన్నారు! తీరా డిశ్చార్జి చేసేసాడు. ఈ గుండె జబ్బు యింతపని చేస్తుందనుకోలేదు. శ్రీధరరావు గొంతు బొంగురుపోయింది! ఏడుపును బలవంతంగా అరికట్టుకుంటున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

కృష్ణ ఏమీ మాట్లాడలేదు.

"ఆ మధ్య అమెరికా వెళ్లావని విన్నాను. ఎప్పుడొచ్చావ్?" అన్నాడు శ్రీధరరావు కన్నీళ్ళొత్తుకుంటూ!

"వారం దినాలయింది" పొడిగా అన్నాడు కృష్ణ.

"ఇలా హాస్పిటల్‌కు వచ్చావేం?" శ్రీధరరావు అన్నాడు.

"ఏం లేదు! ఒక స్నేహితురాలు హాస్పిటల్లో వుందంటే చూడాలని వచ్చేను. కాని ఆవిడ నిన్ననే డిశ్చార్జి అయి వెళ్ళిపోయిందంట!"

"మరి నే వస్తాను. ఎప్పుడయినా కనిపిస్తూ వుండు!" అంటూ శ్రీధరరావు వెళ్లిపోయాడు.

కృష్ణ భారంగా అడుగులేస్తూ రామకృష్ణా మిషన్ బీచ్‌వైపు కదిలిపోయాడు. చెరోవంకా వెళ్లిపోతున్న యిద్దర్నీ చూస్తూ నేను మేడఎక్కి రూమ్‌లోకి వెళ్ళాను. ఆ రూమ్‌లో ఒక్కక్షణమైనా ఉండటానికి మనస్క-

రించలేదు. అలమారులోని ఫ్లాస్కు, కాగితాలు తీస్తున్నాను. ఒక తారగా వున్న బైబిల్ క్రింద ఒక పుస్తకం దొరికింది. ఆత్రంగా దాన్ని తీసి విప్పాను. అది భారతి రాసుకున్న డైరీ! ఆమె జ్ఞాపకాల దొంతరలోని కొన్ని ముఖ్య ఘట్టాలను ముక్కలు ముక్కలుగా త్రుంచి పదిల పరచు కున్నట్టుంది. ఆత్రంగా పేజీలు తిరగేశాను.

"బ్రతుకులెంత చిత్రమైనవి! ఒక్కోళ్ళ జీవితం సాఫీగా లోటు లేకుండా సాగిపోతుంది. నాకు బ్రతుకు ముళ్ళబాటే అయింది! అడుగు తీసి అడుగు వేయటమే కష్టంగా వుంది. కలలు కలలుగానే మిగిలిపోతాయి కాబోలు! ఒక్క కోరికా నెరవేరదు...."

"....కృష్ణ విదేశాలకి వెళ్ళి ఈ వేళకి సరిగ్గా సంవత్సరమయింది. అతను తిరిగి వచ్చేంతవరకు ఈ వూహల పల్లకిని అలంకరించి నిలిపి వుంచనా? అనుకున్నాను....ఆ ఆశతోనే, ఆ ధైర్యంతోనే అతనికి మాట యిచ్చాను...."

"నాన్నగారు సంబంధం వెతికారు. వరుడిని పెళ్ళిచూపులికి తీసుకు వస్తామని నన్ను సిద్ధంగా వుండమని చెప్పారు. కృష్ణ విషయం చెప్పాను. అతనితో కలిసి నేను అల్లుకొన్న ఆశల పందిరిని కూలద్రోయవద్దన్నాను. నాన్నగారు వుగ్రులయ్యారు. కృష్ణ కులం ఏమిటి? మన కులం ఏమిటని గర్జించారు. చిన్నతనంలో కలిసి తిరిగితే - ఆ చనువు, స్నేహం వేరు! వయసు పైబడి, వివాహం విషయంలో జీవితాల్ని ముడిపెట్టుకుందామనుకోవడం చాలా వెర్రి వూహ అని కొట్టిపారేసేరు, నా మాటని! ఆయనకి ఎదురుచెప్పటం నావల్ల కాకపోయింది. కృష్ణ దగ్గర్నుంచి వుత్తరాలు కూడా రావటంలేదు....ఏ ధైర్యంతో నాన్న నెదిరించను? ఆడదాన్ని వంటరిగా ఎక్కడికి పారిపోను?"

"ఆయన నన్ను మనస్ఫూర్తిగా ఇష్టపడినట్టు హావభావాలే చెబు

తున్నాయి! కాని చాలా విషయాల్లో ఆయనకి నాకు ఆమడదూరం వుంది! ఆయన వ్యవహారికంగా వుంటారు! తినటం, నిద్రించటం, కోరికలు తీరు! కోటం. అంతే! ఆ మనసులో ప్రేమ, ఆరాధన, అనురాగం యిలాంటి రసాలకి చోటే లేదు."

"ఏ ఆడదయినా జీవితంలో ఒక్క పురుషుడినే ప్రేమించగలదేమో! నేను మాత్రం ఇంకా కృష్ణనే ఆరాధిస్తున్నాను. నా మనసులో కృష్ణకి తప్ప వేరొక పురుషుడికి స్థానంలేదు, వుండదు. మనసుని ఆయనపట్ల కేంద్రీకరించలేక, ఆయనకి మల్లే యంత్రంలా గడపలేక రెండు విధాలా ఈ ప్రాణం దాగట్లోపడిన గింజకిమల్లే గిజగిజ కొట్టుకొంటూంది. భగవాన్! యీ జీవికి విముక్తి ఎప్పుడు?

ఈ మధ్య గుండెనొప్పి తరచూ వస్తూంది .... నా వైఖరికి ఆయనలో విసుగు, అసహనం మొదలయింది. ఫలితంగా పదేపదే కీచులాటలు! ప్రేమని వ్యక్తపరిచే శక్తిలేకపోయినా, తనని నేను ప్రేమించటంలేదని మాత్రం తెలుసుకున్నారు. అందుకే ఎదురు తిరిగారు. అప్పుడప్పుడు చెయ్యి చేసుకునేవారు కూడా....శారీరకంగా, మానసికంగా కూడా అలిసిపోతున్నాను...."

"యిప్పటికైనా నేను ఆయన్ని ప్రేమిస్తే ఆయనలో రాక్షసత్వం తొలగుతుంది. కాని....ఆ పని నావల్ల కాదు .... యింక .... యింక ఈ సంఘర్షణని నేను భరించలేను. ఎవరికీ తెలియకుండా యీ మాత్రలు నాతో తెచ్చుకున్నాను.... ఇవి ఒక్కటే నాకు శాశ్వత విశ్రాంతి, సుఖం, శాంతి యిస్తాయి"

చదవటం పూర్తయింది. మనసు మళ్ళీ బరువెక్కింది. కళ్ళనుంచి టపటప రెండు వెచ్చని నీటి బిందువులు రాలాయి. మనసులో యెవరో

పిండుతున్నట్లుంది. భారంగా అడుగులేస్తూ కిటికీవద్దకు వెళ్ళాను. దూరంగా సముద్ర పొడ్డున కృష్ణ నడిచి వెళ్ళిపోతున్నాడు. శూన్యంలోకి పోతున్న వాడికి మల్లే!

ఒకవైపున "చైతన్య మందిరం" దగ్గర నిలబడి ఐస్సుకోసము ఎదురు చూస్తున్నాడు శ్రీధరరావు.

వారిద్దరికీ తెలియని నిజం నాకు తెలుసు! వారిద్దరికే కాదు. యీ హాస్పిటల్ స్టాఫ్‌కి కూడా యీ నిజం తెలీదు. మనసిచ్చినవాణ్ణి మనువాడ లేక, మనువాడిన వాడికి మనసివ్వలేక సంఘర్షణలో నలిగి నలిగి తన్ను తానే ఆహూతి చేసుకుంది భారతీదేవి!

జేబులోంచి అగ్గిపెట్టె తీసి చేతిలోని డైరీకి నిప్పటించాను.